సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ హ్యాండ్ బాల్ అండర్-17 జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. -8లో



గంజాయి కేసుల్లోని ప్రధాన నిందితుడు అరెస్టు

పలు గంజాయి కేసులలో ప్రధాన నిందితుడుగా ఉన్న షేక్ మౌలాలిని పోలీసులు అరెస్టు చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.460	రూ.540
రెండోరకం	రూ.330	రూ.440

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

శ్రీలక్ష్మీనరసింహునికి విశేషపూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు జరిపారు. తోమాల సేవ, ఏకాంతసేవ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు.. అర్చకులు వారికి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బాధ్యతల స్వీకరణ



జిల్లా ప్రాంతీయ రవాణా శాఖాధికారి ప్రసాద్

రాయచోటి టౌన్: జిల్లా ప్రాంతీయ రవాణా అధికారిగా కె.ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా తెనాలి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన అన్నమయ్య జిల్లాకు వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహన దారుడు విధిగా తమ వాహనాల రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. రవాణాశాఖ నియమ నిబంధనలను పాటించాలని తెలిపారు.

సెలవు రోజూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: జిల్లాలో ఆదివారం సెలవు రోజూ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అన్ని వసూలు కేంద్రాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. అలాగే ప్రతి మండలంలోని పల్లెలకు తమ విద్యుత్ సిబ్బంది కరెంటు బిల్లులు వసూలు చేసేందుకు వస్తారని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులు చెల్లించాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు



క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, అధ్యాపకులు

వేంపల్లి: ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. సీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు జోరింట్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరికి రూ 5.50లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు కల్పించామన్నారు. తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సంద్ర, డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్ అకాడమిక్ డీన్ రమేష్ కైలాష్, ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్ కేతినేని వినోద్‌హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రపంచంలో పేరుగాంచిన కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ట్రిపుల్ ఐటీలు అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు.

దేవ దేవా... బాబు కళ్లు తెరిపించు!

- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నేతల ప్రత్యేక పూజలు
- తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ పేరుతో కూటమి డ్రామాలపై మండిపాటు
- కుట్రలు, కుయుక్తులు, అసత్య ప్రచారంపై వైఎస్సార్ సీపీ ధర్మ పోరాటం

సాక్షి రాయచోటి/సాక్షి కడప: ముఖ్యమంత్రి బాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ అంటూ వైఎస్సార్ సీపీ నేతలు ఆ దేవ దేవున్ని వేడుకున్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదమైన లడ్డూలో కల్తీ జరగకపోయినా జరిగినట్లు విష ప్రచారం చేస్తున్న చంద్రబాబు కళ్లు తెరిపించేలా చూడు దేవా.. అంటూ జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన రాజకీయ లబ్ధి కోసం... ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీపై రాజకీయ దుర్బుద్ధితో దుష్ప్రచారానికి ఒడికట్టిన బాబు తీరుపై ఆ పార్టీ నేతలు ధర్మ పోరాటానికి దిగారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను తిప్పికొడుతూ సత్యమేవ జయితే అంటూ ప్రజలకు వివరించారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నేతలు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ధర్మ పరిరక్షణలోనూ....తిరుమల పవిత్రతను కాపాడటంలోనూ వైఎస్సార్ సీపీ సర్కార్ ఏనాడూ వెనుకంజ వేయలేదని...ఎన్నో దైవ కార్యాలు జగన్ సర్కార్‌లోనే చేపట్టిన విషయాలను బహిర్గతం చేశారు. కూటమి సర్కార్‌పై జరుగుతున్న ఈ ధర్మయుద్ధంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశాయి.



నందలూరు : మారెమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ఇరు జిల్లాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని దేవునికడప ఆలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు వెంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించేలా చూడాలని కోరుకున్నారు.

- రాజంపేటలోని ఎల్లమ్మ ఆలయంలో అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే నందలూరులోని ముత్తు మారెమ్మ ఆలయంతోపాటు ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి ఆలయంలోనూ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో కలిసి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పూజలను నిర్వహించారు.
- బద్వేలులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అదే నియోజకవర్గలలోని అట్లూరు మండలం రెడ్డిపల్లిలో పోలేరమ్మ తల్లికి విశేష పూజలు నిర్వహించారు. పోరుమామిళ్లలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి పూజలు నిర్వహించారు.



దేవునికడప ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

- ప్రొద్దుటూరులోని బొల్లవరంలోగల శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రబాబు గతంలో చెప్పులు వేసుకుని వెంకటేశ్వరస్వామి పటాన్ని పట్టుకున్న ఫొటోను చూపుతూ ప్రత్యేకంగా కనిపించారు.
- మైదుకూరులో సమీపంలోని ఎల్లంపల్లి గ్రామం వద్ద తిరుమలనాథస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, రాష్ట్ర నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, రామ గోవిందరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఎర్రగుంట్ల మండలం చిలంకూరులోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, తిరుపతిలో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డిలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
- పులివెందులలోని వెంకటరమణ స్వామి ఆలయంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు సమర్పించారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె, వైఎస్సార్ జిల్లా కమలాపురం ప్రాంతాల్లో పలువురు మండల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆలయాల్లో పూజలు నిర్వహించాయి.
- రైల్వేకోడూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
- పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం పట్టాభి రామాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.
- మదనపల్లెలోని ప్రసన్న వెంకట రమణ ఆలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిసార్ అహ్మద్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.
- రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లెలో డీసీ ఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నమండెంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, లక్కిరెడ్డిపల్లెలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డిల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



రైల్వేకోడూరు ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పూజలు



మదనపల్లె: శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తదితరులు



వాల్మీకిపురం: శ్రీ పట్టాభిరామాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

భక్తుల మనోభావాలకు తీవ్ర విఘాతం

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ఒంటిమిట్ట(సిద్దవటం): రాజకీయ ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హిందూ భక్తుల మనోభావాలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నారని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామిని శనివారం ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి దర్శించుకుని తిరుపతి లడ్డూమీద అసత్య ప్రచారం చేస్తున్నారని, చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం రామాలయం వెలుపల ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు అయినప్పటికీ ఇంత వరకు వారు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోవడం బాధాకరమైన అంశం అని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల్లోకి వెళ్లిన కూటమి నేడు ఆపథకాలను అమలు పరచలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ రాజకీయాలను చేస్తోందన్నారు. చివరికి కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలు కలిశాయని చెప్పడం సరికాదన్నారు. మేము కూడా వెంకటేశ్వరస్వామి భక్తులమేనని, కాలినడకన ఇప్పటి వరకు 23 సార్లు స్వామిని దర్శించుకున్నామని చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు పలు మార్లు తిరుమల దర్శనానికి వెళ్లారని, అప్పుడులేని డిక్లరేషన్ ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల దర్శనానికి వస్తుంటే ఎక్కడిక్కడ ప్రజా ప్రతినిధులను పోలీసులు నిర్బంధించారన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులను మీది ఏమతం అంటూ దైవ దర్శనానికి అడ్డంకి చెప్పకూడదని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వానికి గడువు ఇచ్చామని, ఇక ప్రజలతో కలిసి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ఆందోళనలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ డైరెక్టర్లు ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మేకపాటి నందకిషోర్ రెడ్డి, కూండ్ల ఓబుల్‌రెడ్డి, నిత్యానందరెడ్డి, వెంకటక్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ నారాయణరెడ్డి, లంకా రామిరెడ్డి, గురుమోహన్‌రాజు, సాంబశివారెడ్డి, మీసేవ సుబ్బారెడ్డి, మంటపంపల్లె మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

3 నుంచి ఏపీ టెట్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు (కంప్యూటర్ బేస్డ్)ను అక్టోబర్ 3 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో ఉంటుందని తెలిపారు. ఉదయం సెషన్ 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 2.30 గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను http://aptet.apcfss.in వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష రాసే అభ్యర్థుల తమ పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని తెలిపారు. వివరాలకు 9441557508, 9866041341 నెంబర్‌లకు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని డీఈఓ అనురాధ తెలిపారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ, ఉపాధి



కడప కోటిరెడ్డిసర్కిల్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరు నగరంలో కంప్యూటర్ అండ్ ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు 18 నుంచి 28 ఏళ్ల లోపు కలిగి ఉండాలన్నారు. 35 రోజులపాటు కొనసాగే శిక్షణా కాలంలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణానంతరం రూ 15 వేల వేతనంతో వివిధ సంస్థల్లో ఉపాధి కల్పిస్తారన్నారు. పూర్తి వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

జాతీయ ఉర్దూకవి సమ్మేళనానికి ఆహ్వానం

రాయచోటి అర్బన్: పుట్టపర్తి జిల్లా కదిరి పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న జాతీయ ఉర్దూకవి సమ్మేళనానికి అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఉర్దూకవులకు ఆహ్వానం అందింది. బయాదే ఏ ఇక్బాల్ ఖురేషి జ్ఞాపకార్థం జష్నేమిలాదున్నబి సందర్భంగా ఈనెల 30వ తేదీ ఉదయం 10గంటలకు కదిరి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జాతీయ ఉర్దూ కవి సమ్మేళనం జరగనుందని రాయచోటి ఉర్దూకవులు మహమ్మద్ హాషీం, ఇమ్రోజ్అలీఖాన్,నౌషాద్‌లు తెలిపారు. ఈ సమ్మేళనానికి రాయలసీమతో పాటు హైదరాబాద్‌కు చెందిన ఉర్దూకవులంతా పాల్గొంటారన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పరిశీలన 30లోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పరిశీలనను సెప్టెంబర్ 30వ తేదీలోగా వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ , అసైన్మెంట్ భూముల ఫ్రీ హోల్డ్ పరిశీలన, రెవెన్యూ శాఖకు సంబంధించి పీజీఆర్ఎస్‌లో భూమి సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన ప్రక్రియను సజావుగా సాగేందుకు జీఓ 596లో స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియను చట్టబద్ధంగా నిబంధనల మేరకు చేయాలని కలెక్టర్ సూచించారు. పరిశీలన ప్రక్రియలో ఎవరి ఒత్తిడికి లోను కారాదన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అసైన్మెంట్ భూముల పరిశీలన కూడా పూర్తి చేసి అక్టోబర్ 20లోగా పూర్తి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డిఆర్ఓ సత్యనారాయణ రావు, ఆర్డీఓ రంగస్వామి, తహశీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై అవగాహన

గాలివీడు: స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణతోపాటు ఐక్యతా భావం పెంపొందుతాయని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం నూలివీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ,తల్లిదండ్రులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్కౌట్స్ మాస్టర్ కరకోటి చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విశేష సేవలందించిన విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర,జాతీయ స్థాయిలో సర్టిఫికెట్లు, అవార్డుల ప్రదానం చేస్తారన్నారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా జీఓనంబర్ 27 ప్రకారం విద్య,ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తారన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు

- కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ బాలకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఫయాజ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరుకుల్లో కోత

- అంగన్‌వాడీల్లో 3 నెలలుగా కనిపించని కందిపప్పు
- నూనె ప్యాకెట్లు అరకొరగా అందజేత



అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే కందిపప్పు ప్యాకెట్

రాయచోటి: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులకు ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్-6 హామీలను గాలికి వదిలినట్లుగా అంగన్ వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు అందించే సరుకుల్లో కూడా కోత విధించింది. పౌష్టికాహారంలో భాగమైన కందిపప్పు, వంట నూనె విషయంలో కూడా కూటమి ప్రభుత్వం కక్కుర్తి పడడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు కంది పప్పు, వంట నూనెలు మూడు నెలలుగా అందలేదు. కేంద్రాలకు సరఫరా చేసే కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ వారిపై నెపం మోపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిర్దేశిత గడువు ముగిసినా కందిపప్పును అందివ్వకపోగా నూనె మాత్రం అరకొరగా అందజేసి చేతులు దులుపుకోవడం గమనార్హం. మార్కెట్‌లో తగినంత పప్పు అందుబాటులో లేదంటూ కాలయాపన చేస్తూ అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇచ్చే బియ్యం, వంట నూనె, కందిపప్పును జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా స్థానిక చౌకదుకాణ డీలర్లు అందజేస్తూ వచ్చారు. ప్రస్తుతం నెలకు సరిపడా బియ్యం, అరకొర వంటనూనెలను మాత్రమే ఆ శాఖ అందించింది. మూడు నెలలుగా కందిపప్పును మాత్రం ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులకు ఏం పెట్టాలో.. ఎలా సర్దిచెప్పాలో అర్థం కావడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాలకు తూట్లు

అన్నమయ్య జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు 27 టన్నుల 250 కిలోల కందిపప్పు అవసరం ఉంది. కాంట్రాక్టర్ కిలో రూ.168.25 వంతున అందజేసేందుకు ముందుకొచ్చారు. ఆ కాంట్రాక్టర్ ద్వారా ఈ నెలకు సరిపడా కందిపప్పును మాత్రమే అందించే చర్యలను అధికారులు చేపట్టారు. దక్కించుకున్న టెండర్ ప్రకారం కంది పప్పును కాంట్రాక్టర్ కేంద్రాలకు చేరవేస్తున్నట్లు సమాచారం. నెలకు 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు అరకిలో, గర్భిణి, బాలింతలకు కిలో చొప్పున అందించాల్సి ఉంది. సాధారణంగా ప్రతి నెల 19వ తేదీలోపే బియ్యం , పప్పు, నూనె ఇతర వస్తువులను అందజేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే ప్రభుత్వమే మార్గదర్శకాలకు తూట్లు పొడిచింది.



జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు:	11
అంగన్వాడీ కేంద్రాలు:	2475
నమోదైన గర్భిణులు:	9964
నమోదైన బాలింతలు:	9760
చిన్నారులు (6 నెలలు - 3 సం॥):	50882
చిన్నారులు (3- 5సం॥):	26538

కంది పప్పును అందజేస్తున్నాం

జిల్లాలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కంది పప్పు, నూనె ఈ నెల 22 నుంచి అందజేస్తున్నట్లు జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శశికళ తెలిపారు. గడచిన మూడు నెలలకు సంబంధించిన కంది పప్పు అందించే విషయమై ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని వివరించారు.

పోలీసుల అదుపులో బాల నేరస్తుడు

చిట్వేలి : చిట్వేలి కిరాణాషాపులో రూ. 3 వేలు దొంగతనం చేసిన పఠాన్ జహీర్ (16)ను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాజుల వీధికి చెందిన జహీర్‌ను ఎస్‌ఐ రఘురాం అదుపులోకి తీసుకొని శనివారం జువైనల్ జస్టిస్ బోర్డు కడప వారి వద్ద హాజరు పరిచారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు



గుట్టను తవ్వగా ఏర్పడిన గుంత

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టపల్లె గ్రామ కొండలు, కుంట ప్రాంతాలను జేసీబీలతో రాత్రివేళల్లో కొందరు ధ్వంసం చేస్తూ అక్రమ మార్గంలో డబ్బులు సంపాదిస్తున్నారు. సర్వే నంబర్ 937 పరిసర ప్రాంతాల్లో గ్రావెల్‌ను తరలిస్తున్నారని ఆ ప్రాంత వాసులు తెలిపారు. కొండ ఖనిజ సంపదను ధ్వంసం చేస్తున్నారని, రాత్రివేళ మాకు నిద్రలేకుండా పోతోందని ఆ ప్రాంత వాసులు అంటున్నారు. ఈ విషయమై కడప రేంజర్ ప్రసాద్ శనివారం మాట్లాడుతూ మిట్టపల్లె ఫారెస్టు కొండ ప్రాంతాల్లో అక్రమ గ్రావెల్ తరలిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రివేళల్లో తమ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేసి కొండ ఖనిజ సంపదను అటవీ ప్రాంతం నుంచి పోకుండా గట్టి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

గంజాయి కేసుల్లోని ప్రధాన నిందితుడు అరెస్టు

అర కిలో గంజాయి స్వాధీనం



గంజాయి కేసులలో ప్రధాన నిందితుడైన షేక్ మౌలాలి అరెస్టు చూపుతున్న డీఎస్పీ

మదనపల్లె : పలు గంజాయి కేసులలో ప్రధాన నిందితుడుగా ఉన్న షేక్ మౌలాలిని అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. శనివారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో అరెస్టు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం తదితర అంశాలపై, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 25వ తేదీన కురబలకోట మండలం అంగళ్లు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద, గంజాయి వినియోగిస్తూ విక్రయిస్తున్న 14 మంది నిందితులను ముదివేడు ఎస్‌ఐ దిలీప్ కుమార్ సిబ్బందితో దాడి చేసి అరెస్టు చేశారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు, గంజాయి సరఫరాతో పాటు అమ్మకాలు చేస్తున్న కలకడ మండలం కోన పంచాయతీ బంగారువాండ్లపల్లెకు చెందిన పఠాన్ మౌలాలి(28) పరార్ అయ్యాడన్నారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్ కుమార్ సిబ్బందితో కలిసి శనివారం గాలింపు చర్యలు చేపట్టగా, తంబళ్లపల్లె మండలం, రేణుమాకులపల్లి పంచాయతీ, జోగివానిబురుజు వద్ద ఉన్న కోళ్ల ఫారాల సమీపంలో ఓ వ్యక్తి చేతిలో సంచితో అనుమానాస్పదంగా కనిపించాడన్నారు. పోలీసులను గమనించి అతను తన పల్సర్ ఏపీ 04 బి ఎం 6607 నంబర్ గల వాహనంలో పారిపోయేందుకు ప్రయత్నించాడన్నారు. ఎస్‌ఐ దిలీప్ కుమార్ అతన్ని అదుపులోకి తీసుకున్నారన్నారు. అతని వద్ద ఉన్న సంచిని సోదా చేయగా అరకిలో గంజాయి ఉండటాన్ని గుర్తించామన్నారు. అతడిని విచారించి, షేక్ మౌలాలిగా నిర్ధారించి అరెస్టు చేశామన్నారు. నిందితుడు ముదివేడు పోలీస్ స్టేషన్ లోని క్రైమ్ నెంబర్ 131/2024, మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ లోని క్రైమ్ నెంబర్ 378/2024 గంజాయి కేసులలో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ. 10 వేలు విలువచేసే అరకిలో గంజాయితోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.షేక్ మౌలాలి ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దుల నుంచి గంజాయి కొనుగోలు చేసి మదనపల్లె పరిసర ప్రాంతాలు మండలాలకు సరఫరా చేస్తూ విక్రయిస్తున్నాడని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన సిబ్బందిని అభినందించారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. కురబలకోట మండలం మట్లివారిపల్లి పంచాయతీ ఎరుకలపల్లికి చెందిన మోహన్(37), అదే గ్రామానికి చెందిన ఆర్.సూర్యనారాయణ అలియాస్ సురేంద్ర(40)తో కలిసి ద్విచక్ర వాహనంలో శుక్రవారం రాత్రి మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డులోని నేతాజీ కాలనీకి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, సీటీఎం క్రాస్ రోడ్ రైల్వే బ్రిడ్జి సమీపంలో మిట్టపల్లికి చెందిన కిరణ్ కుమార్ రెడ్డి ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో మోహన్, సూర్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. మోహన్‌కు కాలు విరగ్గా, సూర్యనారాయణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులు ఇద్దరిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

సనాతన ధర్మం కాపాడే బాధ్యత అందరిది



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పసుపులేటి శంకర్

రాయచోటి టౌన్ : సనాతన ధర్మం గట్టిపడేలా.. భారతీయత ఉట్టిపడేలా.. దేవాలయాల పరిరక్షణను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు, రాజంపేట జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. శనివారం రాయచోటి వీరభద్రస్వామి ఆలయంలో జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాల అధికారులు, అర్చకులకు సనాతనం, భారతీయం, దేవాలయాల పరిరక్షణ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలకు వచ్చే భక్తుల మనోభావాలకు అనుగుణంగా శాఖాపరమైన సూచనలు పాటించాలన్నారు. ధూపదీప నైవేద్యాలు సక్రమంగా నిర్వహించి భక్తులు మరింత ఎక్కువగా ఆలయాలకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణకు, ధూపదీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వీరభద్రస్వామి ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి మాట్లాడుతూ కొత్తగా ధూపదీప నైవేద్యాల కోసం దేవదాయశాఖ జిల్లా కార్యాలయంలో ప్రతిపాదనలు సమర్పిస్తే అర్చక వేతనం రూ. 10 వేలు చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ తల్లి ఆలయ ఈఓ కె. శ్రీనివాసులు, తంబళ్లపల్లె ఆలయ ఈఓ మునిరాజ, రిటైర్డ్ తహసీల్దార్ జయన్న తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వెంకటరమణా రెడ్డి

కురబలకోట : మండలంలోని ముదివేడు పంచాయతీ ఎగువ కొంగావారిపల్లెకు చెందిన వెంకటరమణా రెడ్డి (38) భార్య కాపురానికి రాలేదని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ముదివేడు పోలీసులు తెలిపారు. అతని భార్య అపర్ణ జ్యోతి అలిగి మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. ముగ్గురు పిల్లలను కూడా వెంట తీసుకెళ్లింది. పెద్దమనుషులు పంచాయితీ చేశారు. అయినా ఆమె కాపురానికి రాలేదు. భార్య పుట్టింటికి వెళ్లి రాకపోవడం, బిడ్డలను కూడా ఆమె వద్దే ఉంచుకోవడంతో భర్త వెంకటరమణారెడ్డి మనస్తాపానికి గురయ్యాడు. టమాటా పంటకు ఇంట్లో ఉంచిన పురుగుల మందు శుక్రవారం సాయంత్రం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మండలంలోని మట్లివారిపల్లె గ్రామం శివరామపురానికి చెందిన నారాయణ, ఎరుకులపల్లెకు చెందిన మోహన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వీరు సీటీఎం నుంచి మోటార్ సైకిల్‌పై స్వగ్రామం వస్తుండగా మట్లివారిపల్లె మలుపు వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన వీరిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నారాయణను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



బోల్తాపడిన లారీ

ఒంటిమిట్ట(సిద్దవటం) : మండల పరిధిలోని మంగంపేట గ్రామ శివారులో శనివారం కారును లారీ ఢీకొంది. మైదుకూరుకు చెందిన నలుగురు వ్యక్తులు ఇన్నోవా కారులో శ్రీకాళహస్తికి బయలుదేరారు. ఈ క్రమంలో తిరుపతి నుంచి మహారాష్ట్రకు వెళుతున్న లారీ మంగంపేట గ్రామ శివారులోకి రాగానే కారును ఢీకొంది. కారు ముందు వైపు పూర్తిగా దెబ్బతినింది. లారీ బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

సంబేపల్లె : రాష్ట్రంలోనే నారాయణరెడ్డిపల్లె లే అవుట్ ఐదో స్థానంలో ఉందని, నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి శివయ్య తెలిపారు. మండల పరిధి నారాయణరెడ్డిపల్లె పంచాయతీలోని జగనన్న కాలనీలో మన ఇల్లు-మనగౌరవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాసుబాబు దేవన్, మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సిద్దవటం : సిద్దవటంలోని గ్రామ సచివాలయంలో మన ఇల్లు - మనగౌరవంపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు జరిగింది. మండల ప్రత్యేకాధికారి జయసింహ, ఎంపీడీఓ జవహర్‌బాబు, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ఉపాధి హామీ పథకం ఏపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంటు డేవిడ్, ఉపాధి హామీ ఫీల్ అసిస్టెంటు భారతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

6న మాలల ధర్మయుద్ధం సభ

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణంలో డిసెంబరు 6న నిర్వహింప తలపెట్టిన మాలల ధర్మయుద్ధం సభ (వర్గీకరణ వ్యతిరేక సభ)ను జయప్రదం చేయాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం తెలిపారు. శనివారం పట్టణంలోని రెవెన్యూ కాంప్లెక్స్ ఆవరణలో మాలల ధర్మయుద్ధం సభ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ఊరేగింపుగా వచ్చి ఎన్‌జీఓ భవనంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాలమహానాడు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్, వి.కృష్ణమూర్తి, మాల విద్యార్థి సంఘం రాయలసీమ అధ్యక్షుడు మలతోటి సురేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక కాకతీయ విద్యా సంస్థల ఆవరణలో మాజీ సమితి అధ్యక్షులు, దివంగత పోలా వెంకటరెడ్డి శతజయంతిని పురస్కరించుకొని పది రోజులుగా నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆకేపాటి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలా వెంకటరెడ్డి పేద ప్రజల పట్ల ఎక్కువగా మక్కువ చూపేవారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పోలా వెంకటరెడ్డి తనయులు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, పోలా వెంకటరమణారెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి, చెన్నైకి చెందిన శంకరనేత్రాలయ డాక్టర్ గజేంద్రకుమార్‌వర్మ, వైఎస్సార్ సీపీ యూత్ విభాగం నాయకులు పోలా వాసవిరాజ్‌దీరజ్‌రెడ్డి, పోలా సాయి వైభవ్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఏబీ శివారెడ్డి, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, ముస్లిం మైనార్టీ నాయకుడు అబ్దుల్‌మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

166 మందికి ఆపరేషన్లు

ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 775 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 168 మందికి ఆపరేషన్లు చేయాల్సివున్నట్లు వైద్యులు గుర్తించారు. ఇందులో 130 మందికి వైద్య శిబిరంలోనే మొబైల్ ఆపరేషన్ థియేటర్‌లో కంటి ఆపరేషన్లు నిర్వహించారు. కంటి చూపు సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్న 36 మందిని ప్రత్యేక బస్సులో చెన్నైకి తరలించి ఆపరేషన్లు చేయించారు.

ట్రెజరీ జూనియర్ అసిస్టెంట్ అదృశ్యం



విష్ణువర్ధన్ రెడ్డి (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం ఎర్రముక్కపల్లిలో నివాసం ఉంటూ అన్నమయ్య జిల్లా రాజంపేటలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి ఈనెల 23 నుంచి కనిపించడంలేదని భార్య బేబీ షామిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్ సీఐ బి. రామకృష్ణ తెలిపారు. రోజూ కడప నుంచి రాజంపేటకు విధులకు వెళ్లేవాడు. ఈనెల 23న ఇంటివద్ద నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఇంటిలో తన పైఅధికారుల వేధింపులు తట్టుకోలేకున్నానని నోటు రాసి వెళ్లినట్లుగా భార్య తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సారా విక్రేత అరెస్టు

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి పది లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ ఎద్దులవారిపల్లెలో కప్పలమడుగు చంద్ర సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

వసతి గృహాలను పరిశీలించిన జడ్జి



బీసీ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి కృష్ణన్‌కుట్టి

సంబేపల్లె : మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను ఆయన విద్యార్థులను అడిగి తెలుకున్నారు. బీసీ వసతి గృహంలో నీటి సమస్య ఉందని విద్యార్థులు జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన నీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీచ్చారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె : జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం మండలంలోని తవళం పంచాయతీ చౌకిల్లవారిపల్లెలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.4450 నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

బోరు బావుల వద్ద విద్యుత్ వైర్లు చోరీ

ఓబులవారిపల్లె : బోరుబావుల వద్ద మోటార్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను కత్తిరించి దొంగతనానికి పాల్పడుతున్నారు. శుక్రవారం రాత్రి ఎల్లాయపల్లె పంచాయతీ పరిధిలో దాదాపు 8 మంది రైతులకు సంబంధించిన బోరుబావుల వద్ద విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకుని వెళ్లారు. మండలంలో తరచూ వ్యవసాయ భూముల వద్ద మోటార్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను దొంగిలించడం పరిపాటిగా మారింది. రైతులు ఎన్నిసార్లు వైర్లు మార్చినా దొంగతనాలు మాత్రం ఆగడం లేదు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు గ్రామం మెయిన్ బజార్‌కు చెందిన బాబాజాన్ భార్య రిజ్వానా (32) కుటుంబ సమస్యల కారణంగా ఇంటి వద్ద యాసిడ్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆలయం పునర్ నిర్మించాలి

రామాపురం : కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధి గువ్వలచెరువు ఘాట్ రోడ్డులోని కోనేటికోనలో వెలసిన శ్రీ తిరువెంగళనాథస్వామి(వేంకటేశ్వరస్వామి) ఆలయం శిథిలావస్థలో ఉందని ఆలయ చైర్మన్ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. ఆలయాన్ని పునర్ నిర్మించాలని ఆయన అధికారులను కోరారు.

జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



హ్యాండ్‌బాల్ అండర్-17 జిల్లా బాల,బాలికల జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో పీడీలు,కోచ్‌లు

మదనపల్లె సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ అండర్-17 బాల,బాలికల జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. స్థానిక బీటీ కాలేజీ మైదానంలో జరిగిన జట్లు ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి 250 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన బాలికలు 16, బాలురు 26 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు త్వరలో రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజ, క్రీడాభారతి అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, నరేష్‌బాబు, పీడీలు రాంబాబు, అజీమ్, శివ, భద్రయ్య, పార్థసారధి, కిరణ్, రెడ్డిప్రసాద్, క్రిస్టీ, రియాజ్ పాల్గొన్నారు.

ఎంపికైన బాలికలు

గ్రీష్మ, ప్రణతి, హర్షిత, లక్ష్మి, సుప్రియ, భావన, ఫర్హాన, రెడ్డిరాణి, దివ్య, తన్మయ, హేమశ్రీ, సమీరా, మహేశ్వరి, ఇందు, హేమనందిని, భావన, స్టాండ్‌బైలుగా మంజుల, పద్మజ, నిత్య, సౌమ్య, దీప్తి

ఎంపికైన బాలురు

నవీన్‌కుమార్, తంగరాజు, యోగేశ్వర్, షారూక్‌ఖాన్, రంజిత్, త్రివిక్రమ్, తేజసాయిరెడ్డి, సమీర్, అనీష్ అంద్రస్, జీవన్‌కుమార్, పార్థివ్‌సాయి, రాకేష్, జ్యోతి ప్రకాష్, రెడ్డిప్రసాద్, జితేంద్ర, కుషి, స్టాండ్‌బైలుగా సుబ్రమణ్యం, గౌతం, మున్నాఖాన్

జిల్లా ఎస్పీ సహకారంతో
స్వదేశానికి చేరుకున్న బాధితుడు



స్వదేశానికి చేరుకున్న మునిస్వామి

రాయచోటి టౌన్ : ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి అక్కడ అవస్థలు పడుతున్న వ్యక్తి జిల్లా ఎస్పీ సహకారంతో స్వదేశానికి చేరుకున్నాడు. వివరాలు ఇలా..అన్నమయ్య జిల్లా పీలేరు ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆవలకుంట మునిస్వామి జీవనోపాధి కోసం మలేషియాకు వెళ్లాడు. అక్కడ కారు షెడ్‌లో ఉద్యోగం అని చెప్పి కనీస సౌకర్యాలు కూడా లేకుండా చివరికి భోజనం కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని తన భార్య లక్ష్మీదేవికి వీడియో కాల్ ద్వారా తెలియజేశాడు. తనను ఎలాగైనా ఇంటికి రప్పించాలని వేడుకున్నాడు. ఈ విషయాన్ని ఆమె జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లింది. ఆయన వెంటనే స్పందించి పోలీస్ శాఖ ద్వారా బాధితుడిని రప్పించేందుకు ప్రయత్నించారు. ఆయన సహకారంతో బాధితుడు శుక్రవారం రాత్రి బయలుదేరి శనివారం రాయచోటి జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తనను ఈ కష్టాల నుంచి విముక్తి కలిగించిన జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపాడు.

విద్యను వ్యాపారం చేసిన ప్రభుత్వాలు


ఏఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య



మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

రాజంపేట టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను వ్యాపారం చేశాయని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. ఏఐఎస్‌ఎఫ్ రెండవ జిల్లా మహాసభల సందర్భంగా శనివారం రాజంపేట పట్టణం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. ఇటు దేశంలో అటు రాష్ట్రంలోను పాలకులు విద్యావ్యవస్థను పూర్తిగా కార్పొరేట్ మయం చేస్తున్నారని, దీంతో సమీప భవిష్యత్తులో పేదలకు విద్య అందని ద్రాక్షలా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఒక కుటుంబంలో ఎంతమంది చదువుతుంటే అంత మందికి 15వేల రూపాయిలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయినా ఇంత వరకు ఆ హామీ నెరవేర్చే ఆలోచన కూడా చేయడం లేదన్నారు. ఇది ప్రజలను దారుణంగా మోసం చేయడమేనని విమర్శించారు. ఎన్నికల ముందు చంద్రబాబు అండ్‌కో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల హామీలు అమలు చేయకుండా అసెంబ్లీలో రాష్ట్రం అప్పులమయం అయిందని చంద్రబాబు చిలకపలుకులు చెప్పడం హామీలను అమలు చేయలేమని పరోక్షంగా ప్రజలకు సంకేతం పంపడమేనన్నారు. దేశంలో, రాష్ట్రంలో అమ్మాయిలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం సాగించేందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొలుత సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి జెడ్పీ బాలికోన్నత పాఠశాల వరకు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, మాజీ నాయకులు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఈశ్వరయ్య, ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వై.సుబ్రమణ్యంరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి పి.మహేష్, మాధవ్, గంగా, భవిత, తేజస్వి పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు తప్పనిసరి



కుక్కలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

రాయచోటి టౌన్ : పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకుండా ముందస్తుగా టీకా మందులు వేయించుకోవాలని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. శనివారం ప్రపంచ రేబిస్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాయచోటిలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేబిస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు మాలకదయ్య, రాయచోటి డివిజన్ డాక్టర్ ఎం.రియాజ్, డీఎస్‌వో డాక్టర్ వెంకటేష్, సహాయ సంచాలకులు డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ లోకేష్, స్టాటిస్టిక్స్ సహాయ సంచాలకులు డాక్టర్ రవి, టెక్నికల్ వీఏఎస్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.